క్లుప్తంగా

భీమేశ్వరస్వామి సన్నిధిలో జేసీ రాహుల్ మీనా



ఆలయంలో వేదాశీర్వచనం అందుకుంటున్న జేసీ రాహుల్ మీనా

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామిని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భీమేశ్వర స్వామి, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం మండల ఆర్ఐ వాసంశెట్టి సత్యప్రసాద్, వీఆర్ఓ పరం జ్యోతి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ వెంకన్న బాబు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామిని దర్శించుకున్న పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, పిల్లి సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం సతీ సమేతంగా దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆయన వెంట ఉండి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా(బాబ్జీ), ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, నాయకులు పిల్లి శ్రీను, దడాల రవికుమార్, శీలం గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

తోటతో సూర్యప్రకాశ్ భేటీ



కమిటీల ఏర్పాటుపై చర్చించుకుంటున్న నాయకులు

మండపేట: రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్ ఆదివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులతో భేటీ అయ్యారు. మండపేట విజయలక్ష్మి నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలుసుకున్నారు. ఈ సందర్భంగా రెండు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులపై చర్చించారు. మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగాలకు మండలాల వారీగా కమిటీల నియామకం చేపట్టాలని త్రిమూర్తులును సుభాష్ కోరారు. పార్టీలో యువకులకు మరింతగా ప్రాధాన్యత కల్పించి పార్టీ కార్యక్రమాలు చేరవేసేలా కృషి చేయాలని అన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు చొరవ చూపాలి

కాజులూరు: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు ప్రవేశ పెట్టిన రైతు గుర్తింపు సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రేషన్)కు రైతులు చొరవ చూపాలని మండల వ్యవసాయాధికారి అశోక్ కోరారు. ఆదివారం కాజులూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతు గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో సుమారు 13,500 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకూ 10 వేల మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు.

విశ్రాంత జిల్లా జడ్జి నెల్సన్‌రాజు మృతికి సంతాపం



జడ్జి నెల్సన్‌రాజు (ఫైల్)

మండపేట: విశ్రాంత జిల్లా జడ్జి నెల్సన్‌రాజు మృతి పట్ల ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జొన్నపల్లి సత్యనారాయణ, న్యాయవాదులు ఆదిమూలం అబ్బులు నాయుడు, టీవీ గోవిందరావులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. భీమవరం పట్టణానికి చెందిన నెల్సన్‌రాజు తొమ్మిది సంవత్సరాల పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, 15 ఏళ్ల పాటు జడ్జిగా వివిధ హోదాల్లో పని చేశారు. ఆయన ఆలమూరు జడ్జిగా పని చేసిన కాలంలో బార్ అసోసియేషన్ భవనం నిర్మాణం జరిగిందని అధ్యక్షుడు జొన్నపల్లి తెలిపారు. న్యాయవాదులకు తలమానికంగా, మార్గదర్శకంగా వ్యవహరించేవారని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ఆకలి కేకలు

- రెండు నెలలుగా అందని వేతనాలు
- ఉపాధి కూలీలకు తప్పని ఇబ్బందులు

రాయవరం: గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేని రోజుల్లో కూలీలకు ఉపాధి కల్పించేందుకు, వలసల నివారణకు స్థానికంగా పనులు కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించి 15 రోజుల్లో వేతనాలు అందించేలా చట్టం చేసింది. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటుంది. సకాలంలో కూలీలకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో గడచిన రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించని పరిస్థితి నెలకొంది.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో రామచంద్రపురం, మండపేట, రాయవరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, కాజులూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో ఉపాధి హామీ పనులను జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అధికారుల పర్యవేక్షణలో చేపడుతున్నారు. పనులను క్లస్టర్ పరిధిలోని 94 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యవేక్షణ చేస్తున్నారు. అలాగే క్లస్టర్ పరిధిలో 73,820 మంది ఉపాధి కూలీలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో యాక్టివ్‌గా ఉన్న ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించారు. ఇప్పటి వరకు 85,444 మంది కూలీలకు పనిదినాలు కల్పించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం రోజుకు రూ.300 వంతున ఉపాధి వేతనం చెల్లించాలి. ప్రస్తుతం కూలీలకు రోజుకు వారు చేసిన పనికి కొలతల ఆధారంగా సుమారుగా రూ.295లు వంతున చెల్లిస్తున్నారు. ఒక కుటుంబంలో భార్య, భర్త వారం రోజులు పనికి వెళ్తే వారికి సరాసరిన రూ.3,930 వరకు చెల్లించాలి. ఈ లెక్కన ఒక కుటుంబానికి ఎనిమిది వారాలకు రూ.30వేల వరకు రావాల్సి ఉంటుంది. బకాయిలు వస్తే ఇంటి ఖర్చులకు ఇబ్బందులు ఉండవని కూలీలు చెబుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో అధికారులు దృష్టిసారించి బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు.

ఊపందుకున్న పనులు

ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల నుంచి ఉపాధి పనులు ఊపందుకున్నాయి. సాధారణంగా రబీ సీజన్‌లో కూలీలకు డిమాండ్ ఉంటుంది. అయితే రబీలో యంత్రాల వినియోగం అధికంగా ఉండడంతో కూలీలకు అంతగా పనులు లేక, ఖాళీగానే ఉంటున్నారు. దీంతో వారు ఉపాధి హామీ పథకం వైపు మళ్లుతున్నారు. ప్రతి ఉపాధి కూలీకి పని కల్పించాలన్న ఉద్దేశ్యంతో పని దినాలను పెంచేలా జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏప్రిల్ నుంచి పనులు చేసే ఉపాధి కూలీల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో క్లస్టర్ పరిధిలో 51,665 కుటుంబాలు ఈ పథకం ద్వారా పనులకు వస్తుండగా, వ్యక్తిగతంగా 85,444 మంది కూలీలు హాజరయ్యారు. కొన్ని కుటుంబాలు వంద రోజుల పనుల లక్ష్యానికి చేరువవుతున్నాయి.



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

క్లస్టర్ పరిధిలో ఉపాధి హామీ పనుల వివరాలు..

నియోజకవర్గాలు: రామచంద్రపురం, మండపేట.
మండలాలు: రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం.

మొత్తం జాబ్ కార్డుల సంఖ్య	3,820
కూలీల సంఖ్య	1,23,282
యాక్టివ్ జాబ్ కార్డుల సంఖ్య	52,647
యాక్టివ్ కూలీలు	85,444
ఇప్పటి వరకు కూలీలకు చెల్లించిన వేతనాలు	రూ.37.92 కోట్లు
మెటీరియల్ రూపంలో చెల్లించిన సొమ్ము	రూ.8.16 కోట్లు
రెండు నెలల్లో సుమారుగా పని చేసిన కూలీలు	3 వేలు
చెల్లించాల్సిన బకాయిలు సుమారుగా	రూ.36 లక్షలు

ఆందోళన వద్దు



రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాల్సి ఉన్న విషయం వాస్తవమే. పని చేసిన ప్రతి కూలీకి వేతనాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. నిధులు విడుదలైన వెంటనే కూలీల ఖాతాలకు జమ అవుతాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఎం.ఈశ్వరరావు, ఇన్‌చార్జ్ ఏపీవో, ఉపాధి హామీ పథకం, రామచంద్రపురం.

వేగంగా ఉపాధి పనులు



జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనులు వేగంగా సాగుతున్నాయి. 2024 డిసెంబరు వరకు పనిచేసిన కాలానికి ఉపాధి హామీ కూలీల ఖాతాల్లో వేతనాలు జమ అయ్యాయి. కేవలం రెండు నెలలకు మాత్రం జమ కావాల్సి ఉంది. ఈ వారంలో వారి ఖాతాలకు జమ అయ్యే అవకాశముంది.

సుధారాణి, ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్, రాయవరం

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



వెల్లలో ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో చిన శెట్టిబలిజపేట వద్ద నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో ఆదివారం సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుడు, వినాయకుడు, అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం శెట్టిబలిజ సంఘ పెద్దలు, కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణపతి శాస్త్రి బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శాంతి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగంతోనే ఎస్సీ వర్గీకరణ

కపిలేశ్వరపురం: ఎస్సీ వర్గీకరణకై ఉవ్వెత్తున సాగిన ఉద్యమంలో అశువులు బాసిన అమరవీరుల త్యాగ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పిప్పర సంపతరావు, తాతపూడి రాజేష్ శర్మ అన్నారు. అమరవీరులకు నాయకులు నివాళులర్పించారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

- అర్తమూరులో అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణం
- అలరించిన శోభాయాత్ర
- హాజరైన యూపీ డీజీపీ రామశాస్త్రి



యూపీ డీజీపీ రామశాస్త్రిని సత్కరిస్తున్న చైర్మన్ బుల్లిస్వామిరెడ్డి, తదితరులు

మండపేట: ఆధ్యాత్మిక గ్రామం అర్తమూరులో వేంచేసి యున్న శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం నిత్య పూజలు, దర్శనాలు జరిగాయి. అనంతరం భూ వరాహ హోమం నిర్వహించారు. కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం కార్యదర్శి సత్తి వీర్రెడ్డి ప్రత్యేకంగా సేకరించిన తిరుమలలోని పవిత్ర తీర్థ జలాలను వందలాది మంది మహిళలు సహస్ర కలశాలతో శోభయాత్ర నిర్వహించారు. స్వామివారికి, ఉభయ దేవేరులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామికి విశేషాలంకరణ, బంగారు పుష్పాలతో అభిషేకం చేశారు. రాత్రి స్వామివారి కల్యాణ మండపంలో శాస్త్రోక్తంగా ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధి నుంచి అర్చక స్వాములు తీసుకువచ్చిన శేష వస్త్రాన్ని స్వామికి సమర్పించారు. ఉత్తరప్రదేశ్ డీజీపీ పిడపర్తి వెంకట రామశాస్త్రి, ఆయన సతీమణి నీరజాశాస్త్రిలను స్వామివారి భక్తమండలి చైర్మన్ సత్తి బుల్లిస్వామి రెడ్డి, కన్వీనర్ కర్రి బాపిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం వేద పండితులు స్వామివారి దివ్య కళ్యాణ ఘట్టాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు స్వామి వారికి మంచి ముత్యాల తలంబ్రాలు అందించారు. రాజమండ్రికి చెందిన ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ పరిమి నాగసత్య ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాపేశ్వరం కాజా తయారీలో ప్రసిద్ధి గాంచిన సురుచి ఫుడ్స్‌ను ఆదివారం ఉత్తరప్రదేశ్ డీజీపీ పెదపర్తి వెంకట రామశాస్త్రి సందర్శించారు. ఆయనకు సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లికార్జునరావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు బాహుబలి కాజాను బహూకరించారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం



మంటల్లో కాలిపోతున్న ఎలక్ట్రిక్ స్కూటర్

రావులపాలెం: స్థానిక కెనాల్ రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం ఒక ఎలక్ట్రిక్ స్కూటర్ ఒకసారిగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా మార్టేరు సమీపంలో నెగ్గిపూడికి చెందిన సత్తి పెద్దిరెడ్డి ఆరా ఎలక్ట్రిక్ స్కూటర్ వేసుకుని పని నిమిత్తం రావులపాలెం వచ్చారు. స్థానిక కెనాల్ రోడ్డులో పెద్ద వంతెన సమీపానికి వచ్చే సరికి వాహనం నుంచి పొగలు రావడంతో వాహనాన్ని నిలిపివేసి దూరంగా వెళ్లిపోయాడు. దీంతో కొద్దిసేపటికి మంటలు చెలరేగి స్కూటర్ దగ్ధమైంది. అయితే మూడు సంవత్సరాలుగా ఈ వాహనం వాడుతున్నా, ఇటువంటి ఇబ్బంది రాలేదని, ఇప్పుడే ఇలా మంటలు వచ్చాయంటూ పెద్దిరెడ్డి తెలిపారు. అయితే స్కూటర్లో బ్యాటరీ, ఎలక్ట్రికల్ సర్క్యూట్ వద్ద మంటలు రావడంతో ఈ ఘటన జరిగి ఉంటుందని స్థానిక మోటారు సైకిల్ మెకానిక్‌లు అంటున్నారు.

సీతారామాలయంలో కో ఆర్డినేటర్ ప్రత్యేక పూజలు



సీతారామాలయంలో పూజలు చేస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు

అయినవిల్లి: మండలంలోని నేదునూరు గ్రామం వాసంశెట్టివారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాలయ శంకుస్థాపనలో భాగంగా పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, అయినవిల్లి జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, నాయకులు కనుమూరి సత్యనారాయణరాజు, మట్టపర్తి వెంకటరమణ, వాసంశెట్టి తాతాజీ, పేరిచర్ల రఘురామరాజు, కామన కృష్ణమూర్తి, చిలువూరి సాయిరాజు, పులిదిండి ప్రభాకర్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న సూర్యతాపం



ముక్కామలలో వెలవెలబోతున్న ప్రధాన రహదారి

అంబాజీపేట: శీతాకాలం వెళ్లకుండానే సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మహాశివరాత్రికి చలి శివ శివా అంటూ వెళ్లిపోతుందని పెద్దలు చెబుతారు. శివరాత్రికి పది రోజులు ముందు నుంచే వాతావరణ ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. వేసవి ప్రవేశించకుండానే ఈ మేరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాధారణాన్ని మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత మూడు రోజులోనే 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి, మామిడికుదురు మండలాల్లో నమోదవుతున్నాయి. దాంతో ప్రధాన రహదారులు మధ్యాహ్న సమయంలో వెలవెలపోతున్నాయి. దీన్ని బట్టి ఉష్ణోగ్రతలు ఏమేర పెరిగాయో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది శీతాకాలం సీజన్లో చలి సైతం తక్కువేనని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఈ ఏడాది ఎండ తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 10 గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. సూర్యుని ఎండ తీవ్రతకు నాలుకలు తడారిపోతున్నాయని పలువురు వాపోతున్నారు. దీంతో కూలింగ్ వాటర్, జ్యూస్ సెంటర్ల వైపు క్యూ కడుతున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు మేము సైతం సిద్ధం అన్నట్టుగా నిన్న మొన్నటి వరకు కానరాని ఫ్రూట్ జ్యూస్ సెంటర్లు మండల పరిసర గ్రామాల్లో కోకొల్లలుగా వెలిశాయి. మరో పక్క కొబ్బరిబొండాలు, పుచ్చకాయల విక్రయాల స్టాల్స్ పెరిగాయి. పుచ్చకాయలైతే ఆకుపచ్చ, పసుపు వంటి రంగుల్లో సైతం లభిస్తున్నాయి. ఎండ తీవ్రతకు ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరం



బి.దొడ్డవరంలో నిర్వహిస్తున్న వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలోని పినిశెట్టివారి బాల వీరభద్రస్వామి సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, ప్రభ ఊరేగింపు, బాణసంచా కాల్పులు, నృత్యాల నడుమ వైనతేయ గోదావరి నది వరకు స్వామిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం నది వద్ద పినిశెట్టి వెంకటస్వామి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాల వీరభద్రస్వామి సంబరాన్ని పినిశెట్టివారి పాలెం ఆలయం వద్ద ఘనంగా జరిపించారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. విఘ్నేశ్వర పూజ, శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు బాల వీరభద్రస్వామికి శూలాలతో వీరనాట్యం చేస్తూ పరవశింపచేశారు. ఈ పూజలు ఆద్యంతం కనుల పండువలా నిర్వహించారు.

రసాయనాలు వద్దు.. సేంద్రియమే ముద్దు

- రసాయనాల సాగుతో ఆరోగ్యానికి ముప్పు
- పంట పొలాలు విషతుల్యం
- దిగుబడులూ నామమాత్రమే



తొలకరి వరిసాగులో రసాయనిక మందులు పిచికారీ చేస్తున్న రైతులు

కె.గంగవరం: అధిక దిగుబడులపై ఆశతో మితిమీరిన రసాయన ఎరువుల వాడకం అనర్థాలకు కారణమవుతోంది. ముఖ్యంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులను భారీగా వినియోగించడంతో పంటలు విష తుల్యమవుతున్నాయి. ప్రధానంగా తెగుళ్లను అంతమొందించేందుకు విచ్చలవిడిగా మోనోక్రొటోఫాస్, డైక్లోరోపాస్ లాంటి ప్రమాదకరమైన పురుగుల నివారణ మందులను పంటలపై అధిక మోతాదులో వినియోస్తున్నారు. దీంతో భూసారం తగ్గడమే కాక దిగుబడులు నామమాత్రంగా వస్తున్నాయి. రెండోసారి వేసిన పంటకు కనీస స్థాయిలో కూడా పెట్టుబడులు రావడం లేదు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించడానికి వ్యవసాయశాఖ అధికారులు చేపడుతున్న చర్యలు ఫలితాలను ఇవ్వడం లేదు.

నియోజకవర్గంలో..

రామచంద్రపురం నియోజకర్గంలోని కె.గంగవరం మండలంలో 6,344 హెక్టార్లు, కాజులూరు మండలంలో 7,702 హెక్టార్లు, రామచంద్రపురం రూరల్‌లో 7,242 హెకార్లు వెరసి రామచంద్రపురం నియోజకర్గ వ్యాప్తంగా 21,688 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. వాస్తవానికి భూసార పరీక్షల ఆధారంగా రైతులు తమ పొలాల్లో ఎలాంటి మూలకాలు లోపించాయో తెలుసుకుని వాటికి సంబంధించిన ఎరువును మాత్రమే వేయాలి. దీనిపై గ్రామీణ ప్రాంత రైతులకు అవగాహన లేకపోవడంతో అసలు తమ భూముల భూసార పరీక్షా పత్రాలు తీసుకోవడం గానీ, వాటి వివరాలు తెలుసుకోవడం గానీ చేయడం లేదు. వ్యవసాయాధికారులు చెప్పినప్పటికీ తమకు తోచిన విధంగా విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో దిగుబడి మాట ఎలా ఉన్నా పంట భూములు విషతుల్యమతున్నాయి. ఇలాంటి ఉత్పత్తులను తినడం వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుంది. వీటివల్ల పొలం గట్లపై పెరిగే పచ్చగడ్డి సైతం విషతుల్యమై ఆ గడ్డిని ఆహారంగా తీసుకునే పశువులు సైతం అనారోగ్యానికి గురువుతున్నాయి. అధికారులు స్పందించి రసాయనిక ఎరువులు అధికంగా వినియోగించకుండా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని పలువురు పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

అతిగా వాడొద్దు



అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం మంచిది కాదు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా తగు సూచనల మేరకే ఎరువులు వాడాలి. విచక్షణా రహితంగా వాడడం వల్ల ఆ పంట ఉత్పత్తులు తిన్నవారికి ఆరోగ్యం దెబ్బ తింటుంది. పైగా భూసారం సైతం క్రమంగా తగ్గిపోతుంది. పచ్చిరొట్ట, ఇతర సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు దృష్టి సారించాలి.

బలుసు రవి, మండల వ్యవసాయాధికారి.

సేంద్రియ సాగే మేలు



సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగానికి కొద్దిపాటి శ్రమ చేస్తే చాలు. ఎరువులు, పురుగు మందులకు వెచ్చించే ఖర్చును బట్టి చూస్తే ఆరోగ్యకరమైన దిగుబడిని అతి స్వల్ప ఖర్చుతో దక్కించుకోవచ్చు. రానున్న కాలంలో ప్రతి రైతు సేంద్రియ ఎరువులపై దృష్టి సారిస్తే మంచి జరుగుతుంది.

ఇళ్లా సూర్యనారాయణ, శివల, కె.గంగవరం మండలం.

ధనమ్మమర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో వెలసిన ధనమ్మతల్లి మర్రి క్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఆయా గ్రామాల వారితో పాటు రావులపాలెం, కొత్తపేట, అయినవల్లి, కె.గంగవరం మండలాల భక్తులు క్షేత్రాన్ని సందర్శించారు. మహిళలు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారిని విశేషంగా అలంకరించారు.

వేదస్మరణతో మానసికోల్లాసం

అయినవిల్లి: సనాతన ధర్మాన్ని వేదసారాల ద్వారానే తెలుసుకోవచ్చని వేదస్మరణతో, పఠనతో మానసికోల్లాసం అలవడుతోందని, తద్వారా భగవంతున్ని చేరుకోవచ్చని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ వేద శాస్త్రాలు ఏమి అయితే చెబుతున్నాయో వాటిని మానవులు ఆచరించాలన్నారు. ఇప్పుడు కొంత మంది నేనే భగవంతున్ని నాకే పూజలు చేయండి అంటూ దొంగబాబాలు పుట్టుకొస్తున్నారన్నారు. భగవంతుడు ఒక్కరే ఉన్నారూ ఆయన్నే సమస్త ప్రాణి కోటి పూజలు చేయాలని ఆయన సేవలోనే తరించాలన్నారు. ఆయనే శ్రీకృష్ణ భగవానుడు అన్నారు. అనంతరం మందిరం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.